క్లుప్తంగా

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



నరేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

బత్తలపల్లి: మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బెస్త నారాయణ, బెస్త నరేష్ ఇద్దరూ ఇటీవల ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో మృతుల కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల వితరణ



ఆలయ ఈఓకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి మదనపల్లికి చెందిన పిడతల రమాదేవి కుమారులు లక్ష్మీనరసింహ ప్రసాద్, చక్రధర్ కౌశిక్ తదితరులు గురువారం వెండి వస్తువులు వితరణ చేశారు. వెండి తట్ట 1, వెండి గిన్నెలు 5, ఉద్ధరిజలు 2 కలిపి 1.7 కేజీల వెండి వస్తువులను ఆలయ ఈఓ వెండి దండి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

వైభవంగా అక్క దేవతల పరుష



అలంకరణలో అక్క దేవతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద గురువారం అక్క దేవతల పరుషను వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పూజారులు గుంజర మహేష్, బయన్నల ఆధ్వర్యంలో అమ్మవార్లను జలధికి తీసుకెళ్లారు. 9 గంటలకు పంచామృతాభిషేకం, పుణ్యాహ వచనం, శ్రీసూక్త పారాయణం, 10 గంటలకు వడి నింపే కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 3 గంటలకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



కృష్ణాపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. గురువారం ఆయన బుక్కపట్నం మండలం కృష్ణాపురంలోని జగనన్న కాలనీలను సందర్శించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హుస్సేన్, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, ఎంపీటీసీ కేశవ పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైద్య శిబిరం



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి సేవా సంస్థలకు చెందిన అంతర్జాతీయ వైద్య బృందం గురువారం ప్రశాంతి నిలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, సెకండ్ ఒపీనియన్ కావాలనుకునే వారు ఈ శిబిరం ద్వారా సేవలు పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, షుగర్, బీపీ, చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా చికిత్సలు చేస్తామన్నారు. అనుభవజ్ఞులైన మానసిక వైద్యులు కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జూలై 3వ తేదీ వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు.

త్యాగనిరతికి ప్రతీక 'బక్రీద్'

కదిరి: త్యాగ నిరతికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను గురువారం కదిరి, పరిసర మండలాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గా మైదానం ఉదయం 8 గంటలకే ముస్లిం మైనార్టీలతో కిక్కిరిసి పోయింది. అక్కడ స్థలం సరిపోక ఇంకా ఎంతో మంది ముస్లింలు కదిరి–బెంగళూరు రహదారిపై సామూహిక ప్రార్థనలు చేయడం కనిపించింది. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు. కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఈద్గాలో ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు అత్తార్ చాంద్‌బాషా, ఎంఎస్ పార్థసారథి, మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, మాజీ ఎంపీ కర్నల్ నిజాముద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌ఎండీ ఇస్మాయిల్, డాక్టర్ బత్తల హరిప్రసాద్, పూల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ధర్మవరం అర్బన్: నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



కదిరి: ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

- **ధర్మవరం అర్బన్:** పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ సమీపంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రార్థనల్లో పాల్గొని, బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డిని ముస్లింలు సత్కరించారు.
- **పుట్టపర్తి టౌన్:** మున్సిపాలిటీలోని ఎనుములపల్లి, గోకులం, బీడుపల్లి బ్రాహ్మణపల్లి, ప్రశాంతిగ్రాంలో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మతపెద్దలు సందేశం వినిపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ వాసుదేవన్, సీఐ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి బందోబస్తు చేపట్టారు.
- **ఓడీ చెరువు:** మండలంలోని పలు గ్రామాల నుంచి ముస్లింలు ఉదయమే ఓడీ చెరువు ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముతవల్లి బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం పేదలకు డబ్బు, వస్త్రదానం చేశారు.
- **నల్లమాడ:** నల్లమాడలో ఉదయం 9 గంటలకు ముస్లింలు ర్యాలీగా వైఎస్సార్ కూడలికి చేరుకున్నారు. అక్కడ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పులగంపల్లి, దొన్నికోట, కురుమాల, చౌటకుంటపల్లి, గోపేపల్లి, నల్లసింగయ్యగారిపల్లి, రెడ్డిపల్లి, తిప్పయ్యగారిపల్లి, వంకరకుంట, చారుపల్లి, మీసాలవాండ్లపల్లిలో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు.
- **తలుపుల:** బక్రీద్ పండుగ పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని నమాజు కట్టల వద్ద గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక కుమ్మరపేటలోని ఈద్గా మైదానంలో మతపెద్ద అల్లాబక్ష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.
- **గాండ్లపెంట:** త్యాగానికి ప్రతీక బక్రీద్ (ఈదుల్ అజ్‌హా) అని జామియా మసీద్ ఇమామ్ బషీర్ అహమ్మద్ అన్నారు. స్థానిక ఇద్గా మైదానంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే కటారుపల్లి, రెక్కమాను, తాళ్లకాల్వ, మలమీదపల్లి, కమతంపల్లి, జీనులకుంట, తూపల్లి, యర్రజేనుపల్లి గ్రామాల్లో ప్రార్థనలు చేపట్టారు.
- **తనకల్లు:** తనకల్లు, కోటూరు, దుగినేపల్లి, కొక్కంటిక్రాస్, కొక్కంటి, మారెప్పగారిపల్లి, టీ. సదుం, బొంతలపల్లి, చీకటిమానిపల్లి, బిళ్లారివాండ్లపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ సందడి నెలకొంది. ఈ సందర్భంగా మత పెద్దలు ఖురాన్ సందేశం చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు.
- **ఎన్పీకుంట:** మండల పరిధిలోని పెడబల్లి, గౌకనపల్లి, జౌకల, వెలిచలమల, ధనియానిచెరువు గ్రామాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో హజ్రత్ యూసుఫ్ పండుగ విశిష్టతను వివరించారు.
- **బత్తలపల్లి:** మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు ప్రార్థనల అనంతరం మైనార్టీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ టీవీ శ్రీహర్ష తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మదీనా, జామీయా, నూరానీయా మసీదులకు చెందిన ముతవల్లి కరీంసాబ్, వైస్ ముతవల్లి జిలానీసాబ్, మత పెద్దలు సులేమాన్, మాబాషా పాల్గొన్నారు.
- **ముదిగుబ్బ:** మండల కేంద్రంలోని కదిరి రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగను ముస్లిలు ఘనంగా జరుపుకున్నారు. ఎస్ఐ హేమంత్‌కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- **తాడిమర్రి:** ఎం.అగ్రహారం, శివంపల్లి, పెన్నానది, చిల్లకొండయ్యపల్లి తదితర గ్రామాల ముస్లింలు మండల కేంద్రంలోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
- **అమడగూరు:** అమడగూరు, మహమ్మదాబాద్, తుమ్మల గ్రామాల్లో మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామంలోని మసీద్ దగ్గర జరిగిన సామూహిక ప్రార్థనల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చి వందలాదిగా పాల్గొన్నారు.
రామగిరి: పేరూరు, పెద్దకొండాపురం, గంగంపల్లి, కుంటిమద్ది, మాదాపురం, రామగిరి గ్రామాల్లో ఉదయాన్నే ముస్లింలు ర్యాలీ చేపట్టారు.
నల్లచెరువు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ముదిగుబ్బ: ఈద్గా మైదానంలో బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న మౌలానా



ముస్లింలకు ఈద్ ముబారక్ చెబుతున్న డాక్టర్ బత్తల హరిప్రసాద్, పూల శ్రీనివాసరెడ్డి



గాండ్లపెంట: బక్రీద్ పండుగ సందర్భంగా సామూహిక ప్రార్థనలు



పుట్టపర్తి టౌన్: సామూహిక ప్రార్థనలు చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

నేడు కౌన్సిల్ సమావేశం

కదిరి: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, కమిషనర్ శ్రీహరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం రూ.10 లక్షల పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డు మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజనప్ప పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుడ్డంపల్లి తండాలో గురువారం ప్రమాదవశాత్తూ రూప్లేబాయికి చెందిన పూరి గుడిసె అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న కదిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరాముడు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపింది.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన జరిపిటి రవీంద్ర గురువారం పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిశారు. నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచించారు. అలాగే ఎస్టీ విభాగం మండల కమిటీ అధ్యక్షుడు దేవణానాయక్ కూడా ఎమ్మెల్యేను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి, నారాయణ స్వామి, లింగం, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

ఓబులేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి సమీపంలోని కొండపై వెలసిన ఓబులేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని ఓబులేశ్వరుడి కొండపై మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. గురువారం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు కాలి నడకన వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కొండ కింది భాగంలో నిర్మిస్తున్న కళ్యాణ మంటపం నిర్మాణ పనులను పరిశీలించారు. కొండపైకి సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి ఉంది. మట్టి రోడ్డు ఉండటంతో వాహనాలు పైకి వెళ్లలేకున్నాయి. రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, ఆలయ కమిటీ చైర్మన్ గోవిందప్ప, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు మల్లిరెడ్డి, సురేంద్రరెడ్డి, రామమోహన్ రెడ్డి, కడప రాజా తదితరులు పాల్గొన్నారు.



ఓబులేశ్వర స్వామి కొండను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

అన్నదానానికి విరాళం అందజేత

కదిరి అర్బన్: పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో జులై 3వ తేదీ గురుపౌర్ణమిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. అన్నదానం కోసం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దశరథనాయుడు, పురుషోత్తం రెడ్డి, రాంకిషోర్‌రెడ్డి, అంజి వాల్మీకి పాల్గొన్నారు.

రామాలయానికి..

ఎన్పీకుంట: వంకమద్ది గ్రామంలోని రామాలయం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు విరాళం అందించారు. గురువారం కదిరిలోని ఆయన నివాసంలో గ్రామస్తులకు విరాళం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తల వెంకటరమణ, బత్తల హరిప్రసాద్‌ను గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సంపంగి గోవర్ధన్, నాగరాజు, చంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టండి

- 2024లో వైఎస్సార్‌సీపీదే విజయం
- సీఎం జగన్‌కు అండగా నిలవాలి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



17వ వార్డు బీడుపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పని చేస్తోంది. ప్రతిపక్షాలు ఎలాగైనా 2024 గెలవాలని కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రజలే వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీలో 17వ వార్డు బీడుపల్లిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన మూడన్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజా అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. నవరత్నాలే ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఏదైనా కారణాలతో పథకాలు అందని వారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జగనన్నకు అండగా నిలవండి.. మమ్మల్ని ఆశీర్వదించండి అంటూ ప్రజలకు కోరారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కరించి సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. మాకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

రాబోవు రోజుల్లో మరింత సంక్షేమం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. 90 శాతం ప్రజలు సంక్షేమ పథకాలపై సంతృప్తిగా ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో మరింత సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఇది చూసి టీడీపీ ఓర్వలేకపోతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలే టీడీపీ నాయకులపై తిరగబడతారన్నారు. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయినా వీరి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. 2024లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గాలికి టీడీపీ కొట్టుకుని పోతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, జిల్లా మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవ రెడ్డి, వార్డు అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, పవన్ కుమార్, పరశురాం నాయక్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, రాంజీనాయక్, ఈశ్వరప్ప, ఫోటో సాయి, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, మాజీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కుమారి, స్థానిక నాయకులు చింతా శ్రీధర్‌రెడ్డి, దాసిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి , మురళీకృష్ణారెడ్డి, నాగార్జున రెడ్డి, రంగప్ప, నారాయణప్ప, వెంకప్ప పాల్గొన్నారు.

తొలి ఏకాదశి సందడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని తులసి ఆకులు, పూలు, ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే లింగశెట్టిపాళ్యంలోని ఆంజనేయ స్వామి, కొత్తపేట వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

బత్తలపల్లి: మండలంలోని పలు దేవాలయాల్లో ఏకాదశి సందడి నెలకొంది. బత్తలపల్లి, పోట్లమర్రి, గంటాపురం, రామాపురం, మాల్యవంతం, ముష్టూరు, రాఘవంపల్లి, గుమ్మల్లకుంట, సంఘమేశ్వరం, సంజీవపురం, జ్వాలాపురం, నల్లబోయనపల్లి, తంబాపురం దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లిలోని నరసింహ స్వామి దేవాలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడ్ల బండ్లతో ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

తాడిమర్రి: తాడిమర్రి, మద్దులచెర్వు, మోదుగులకుంట, చిల్ల కొండయ్యపల్లి, కునుకుంట, దాడితోట, పిన్నదరి తదితర గ్రామాల్లో ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి, పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో తొలి ఏకాదశి సందడి నెలకొంది. బుక్కపట్నంలో పన్నేరపు బండ్లను ఊరేగించారు. బుచ్చయ్యగారిపల్లి సమీపంలోని అక్కమ్మ గార్ల పరుషను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పిచ్చల వంశీయులు తెలిపారు.

కనగానపల్లి: మండలంలోని పలు ఆలయాల్లో గురువారం భక్తులు తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. తిరుమలదేవర కొండ, తగరకుంట సమీపంలోని గులగానయ్య కొండపై వెలసిన వేంకటరమణ స్వామి ఆలయాలకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి పూజలు చేశారు. కుర్లపల్లివాసులు వారాదయ్యస్వామిని దర్శించుకునేందుకు భక్తులు కాలినడకన వెళ్లారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.



పుట్టపర్తి: బుచ్చయ్యగారి పల్లిలో పన్నేరపు బండ్ల ఊరేగింపు




బత్తలపల్లి: అలంకరణలో ఆంజనేయ స్వామి



ధర్మవరంఅర్బన్: వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పుట్టపర్తి టౌన్: అలంకరణలో నరసింహ స్వామి



బత్తలపల్లి: పూజలందుకుంటున్న లక్ష్మీవెంకటేశ్వరుడు



కనగానపల్లి: వారదయ్య స్వామి ఆలయంలో భక్తుల పూజలు

వాతావరణ బీమా మంజూరు

చెన్నేకొత్తపల్లి: వాతావరణ బీమా పథకం కింద రూ.7.85 కోట్లు మంజూరైనట్లు వ్యవసాయ అధికారి ఉదయ్ కుమార్ తెలిపారు. వేరుశనగ పంటకు 35,840 ఎకరాలకు గాను ఎకరాకు రూ.982 చొప్పున, చీనీ పంటలకు 2,423 ఎకరాలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున, మొక్కజొన్న 18 ఎకరాలకు గాను ఎకరాకు రూ.4,758 చొప్పున, కందిపంట దిగుబడి ఆధారంగా ఎకరాకు రూ.6,201 చొప్పున 2,351 ఎకరాలకు, టమాట ఎకరాకు రూ.209 చొప్పున 997 ఎకరాలకు మంజూరైనట్లు వివరించారు. జూలై 8న వైఎస్సార్ జయంతి రోజున రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామన్నారు.
ధర్మవరం రూరల్: గత ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బీమా చెల్లించనుందని ఏఓ ముస్తఫా తెలిపారు. వేరుశనగకు ఎకరానికి రూ,1,870, చీనీకి ఎకరానికి రూ.10 వేలు, (కందికి గ్రామాల వారీగా చెల్లించనున్నారు.) తక్కువ మొత్తంలో అంటే ఎకరానికి రూ, 2,781 నుంచి ఎక్కువ అంటే 12,290లోపు చెల్లిస్తారు, టమాట ఎకరానికి రూ.1,260, మొక్కజొన్నకు ఎకరానికి రూ.4,700, రాగి పంటకు ఎకరానికి రూ.4,300 చొప్పున ప్రభుత్వం బీమాను చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.